# అద్వైతానుభవం కలిగాక సంకల్పించేవాడు, సాధన చేసేవాడు ఉండడు

సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భషణములు, 25-3-2001, కొపెల్ల

ప్రియమైన ఆత్మ బంధువుల్లారా,

దేహము చనిపోయిన తరువాత దేహము, జీవుడు విడపోతారు. ఒక మహాశక్తి దేహాన్ని ఈ భూమిమీదకు తీసుకొని వచ్చింది. ఏ శక్తి అయితే ఈ దేహాన్ని భూమిమీదకు తీసుకొని వచ్చిందో, ఏ పని నిమిత్తం తీసుకొని వచ్చిందో ఆ పని పూర్తిఅయిన తరువాత జీవుడిని దేహంతో సెపరేట్ చేస్తుంది. దేహం స్మశానంలో కాల్చబడుతుంది, జీవుడు ప్రయాణం చేస్తాడు. మనం దేహం గురించి ఎంత ఆలోచిస్తున్నామో అందులో సంగంకూడా దేహం చనిపోయిన తరువాత ప్రయాణించే జీవుడి గురించి ఆలోచించటంలేదు. మనకు ఆ అలవాటు లేదు. మన ఆలోచన ఒక క్రమంగా లేదు. మన గురించి మనం ఆలోచిస్తాము, లేకుంటే ఇతరులు మన గురించి ఏమి అనుకొంటున్నారు అని ఆలోచిస్తాము. ఈ ఆలోచన పొరపాటు. నేను ఇలాగ ఉన్నాను, నేను అలాగ ఉన్నాను, నాకు ధనం ఉంది, నాకు కీర్తిఉంది అనుకొనేవాడికి జ్ఞానంరాదు. మనం దేనితో ఒకదానితో తాదాప్యం చెందకుండా ఉండలేము. ఆ తాదాప్యం తెగటానికే సాధన. భగవంతుడు మోక్షం ఇచ్చేటప్పడు మీఇంట్లో ఉన్న సంపదను చూడడు, మీ హృదయంలో  ఉన్న సంపదను చూస్తాడు. భగవంతుడు మన గురించి ఏమనుకొంటున్నాడో అది కావాలిగాని మనగురించి మనం ఏమనుకొంటున్నాము లేకపోతే ఇతరులు మనగురించి ఏమనుకొంటున్నారు దానినిబట్టి మోక్షం ఇవ్వడు. అద్వైతానుభవం కలిగాక సంకల్పించేవాడు, సాధన చేసేవాడు ఉండడు. అద్వైతానుభవం నిజంగా ఎవరైనా కలిగిఉంటే వాడు ప్రత్యక్షంగా ఎంతోకొంత ఇతరులకు తన అనుభవాన్ని అందించగలడు, ఆధ్యాత్మికంగా సహాయం చేయగలడు. లోపల ఉన్న వస్తువు తాలుక శాంతి నీ సహస్రారంలోనికివచ్చి చిమ్మటానికి సిద్ధంగా ఉంది. అది వ్యక్తంకాకుండా ఎవరో అడ్డు రావటంలేదు మనకు మనమే అడ్డుపడుతున్నాము. అదే దేహభావన. నీవుకాని వస్తువును నీవు అనుకొంటున్నావు. అధే ప్రధమ దోషం, అదే మధ్య దోషం, అదే చివరి దోషంకూడా. నీవుకాని వస్తువును నీవు అనుకొనే ధ్యాసే లోపలున్న వస్తువు నీకు వ్యక్తం కాకుండా ఆపుచేస్తోంది. బ్రహ్మం లోపలఉంది, అది వ్యక్తం అవ్వటానికి సిద్ధంగా ఉంది. కాని మనకు ఆ ప్రిపరేషన్ లేదు, అంత పవిత్రత లేదు.

స్వార్థబుద్ధి ఉన్నవాడి దగ్గరనుండి ప్రేమ, శాంతి ఆశించకు, అల్పబుద్ది ఉన్నవాడి దగ్గరనుండి బాధ్యత ఆశించకు అని పెద్దలు చెపుతారు. మీకు అందరికి జ్ఞానం వస్తుంది

కాని చాలాకాలం పట్టవచ్చు. దురదృష్టం ఏమిటంటే చాలామంది ఇన్‌ఫర్‌మేషన్ జ్ఞానం అనుకొంటున్నారు. స్థూలబుద్ధి ఉన్నవాడు సబ్జక్టు సరిగా అర్థం చేసుకోలేడు, వాడికున్న భక్తికూడా శాంతంగా ఉండదు. సూక్ష్మబుద్ధి ఉన్నవాడు సబ్జక్టు బాగా అర్థం చేసుకొంటాడు, వాడి భక్తి స్పష్టంగా, స్వచ్ఛంగా ఉంటుంది. నీ స్వరూపాన్ని అనుసంధానం చేసుకోవటం, నీవు ఎవరిగా ఉన్నావో నిరంతరం గుర్తుపెట్టుకోవటం నిజమైన భక్తిఅని ఆచార్యులవారు చెప్పారు. మనకు భగవంతుడిపట్ల పరిపూర్ణమైన విశ్వాసం ఉండాలి. నాకు భౌతికమైన విషయాలు ఏమీవద్దు. మోక్షస్థితి గురించికూడా నేను కంగారు పడటంలేదు. కాలపరిణామంలో అది ఎప్పడు రావాలో అప్పడువస్తుంది. కాని కృష్ణా నిన్ను కోరేది ఒక్కటే నీయందు నాకున్న భక్తి చలించకుండా నన్ను అనుగ్రహించు అని కృష్ణచైతన్యుడు కృష్ణుడిని ప్రార్థించాడు. మనిషిన పట్టిపీడించేది అహంభావన. అది దేహాన్ని పోగొట్టుకోవటానికి ఇష్టపడుతుంది గాని అది పోవటానికి ఇష్టపడదు. మనలను మనం పొగడుకోవటం వలన, ఇతరులను నిందించటం వలన అహంభావన పెరుగుతుంది. మనం ఎవరినైతే విమర్శిస్తున్నామో వారు లాభం పొందుతారు, మనం నష్టపోతాము అని విమర్శించేవారికి తెలియదు.

ఎక్కడికి వెళ్లినా సాధారణంగా ఏవో సమస్యలు చెపుతూ ఉంటారు. కుటుంబ సమస్యలు, ఆర్థిక సమస్యలు, సామాజిక సమస్యలు ఇవిఅన్నీ నిజమైన సమస్యలుకావు. మనస్సే నిజమైన సమస్య, అది మనం మర్చిపోతున్నాము. దేహం కొత్తగా వచ్చిందిగాని మనస్సు అనేక వేల జన్మలనుండి వస్తోంది. దానిని మార్చుకోవటానికి మనం ప్రయత్నం చేస్తున్నాము. అది మారినట్లు నటిస్తోందిగాని మారటంలేదు. మారు మనస్సు పొందటం చాలాకష్టం, అది తొందరగా మారదు. మనస్సు ఖాళీ చేసింది అనుకో ఆత్మజ్ఞానాన్ని నీవు పిలవనక్కరలేదు. మనస్సు ఖాళీఅయిన మరుక్షణంలో ఆత్మజ్ఞానం వచ్చి ప్రవేశిస్తుంది. అహంభావనకు సంబంధించిన వ్యాపారం తగ్గించుకోండి. మన ఇంట్లోవారిమీద మనకు ప్రేముంది అనుకొంటున్నాము అది ప్రేమకాదు, అది స్వార్థమే. స్వార్థంకూడా ప్రేమ అనుకొనేటంత అమాయకస్థితిలో మనం ఉన్నాము. టెక్నాలజీ అభివృద్ధి అవుతోందిగాని మనం మానసికంగా అభివృద్ధి అవ్వటంలేదు. దానికి దీనికి పొందిక కుదరటంలేదు. నిజంగా నీకు ఈశ్వరునిపట్ల ప్రేమఉంటే ప్రశ్నలే ఉదయించవు, సందేహాలురావు. జంతు జన్మలు, మనిషి జన్మలు, దేవతా జన్మలు ఇలా నీవు కోట్లాది జన్మలు ఎత్తుగాని నీకు పరమ శాంతి, శాశ్వతమైన శాంతి కావాలంటే నా దగ్గరకు రావలసిందే, నీ శాంతిస్థానం నేనే అని భగవంతుడు చెపుతున్నాడు. మూలతలంపును ఎలా పోగొట్టుకోవాలి అని అడుగుతున్నారు. మూలతలంపును పట్టుకొని దానిమూలంలోనికి వెళ్ళు అది ఒక మార్గం. నీకంటే ఉన్నతమైన శక్తి ఒకటిఉందని నమ్మటం

వలన, నమ్మటమేకాదు అది చెప్పినట్లుగా భక్తితో చేయటం వలన కూడా మూలతలంపు పోతుంది. ఇదొక మార్గం. నీకు అనుకూలమైన సంఘటనలు వచ్చినా, ప్రతికూలమైన సంఘటనలు వచ్చినా భగవంతుడు ఇచ్చిన ప్రసాదంగా తీసుకొని ముందుకు దూసుకొనిపో. నీవు ఏ మార్గంలో ప్రయాణం చేసినా దేహ ధ్యాసలోనుండి విడుదల పొందాలి. భగవంతుడిని నిరంతరం స్మరించటం వలన మనకు తెలియకుండానే మూలతలంపు పోతుంది. అది పోవటం ఆ స్థలంలో ఈశ్వరడు నిలబడటం ఒకేసారి జరిగిపోతాయి. అహంభావన ఎందుకు పనికిరానిది అని ముందు నీకు అర్థం అవ్వాలి. అది చాలాగొప్పది అనుకొంటే అది ఎక్కడికి పోతుంది. అహంభావనలోని అల్పత్వం, ఈశ్వరుడిలోఉన్న శక్తి ముందు నీకు తెలియాలి. అప్పడు నెమ్మది, నెమ్మదిగా అహంభావన అణగటం ప్రారంభిస్తుంది. సత్కర్మ ఆచరణ, సద్గ్రంధపఠనం, సత్పురుషులతో సహవాసం ఎన్నో జన్మలు చేస్తేగాని నీకు లోచూపు కలుగదు. లోచూపు కలిగినవాడు హృదయంలో ప్రవేశిస్తాడు. హృదయంలో ప్రవేశించినవాడికి కదా ఈశ్వరడు తన స్వరూపంగా వ్యక్తమయ్యేది.

నీలోఉన్న దోషాలు చెప్పవు, ఇతరులలో ఉన్న దోషాలు చెపుతావు. నీవు బుద్ధిమంతుడవా? నీకు జ్ఞానం ఎలావస్తుంది. ఇంట్లోవారికి పది రూపాయలు ఇస్తే అది త్యాగం అనుకోవు, అదే బయటవారికి ఇస్తే త్యాగం అనుకొంటావు. స్వపర బేధం వచ్చింది ఇంక నీకు జ్ఞానం ఏమిటి? ఎవరైనా మి సహకారం తీసుకొంటే వారు ఉద్ధరింపబడిపోతున్నారు అనుకోకండి, మీరు పవిత్రులు అవ్వటానికి సహకరిస్తున్నారు అనుకోండి నీ జీవితంలో ఒక మాధుర్యం ఉంది, నీ హృదయంలో ఒక తియ్యదనం ఉంది. అది నీవు అనుభవించాలంటే నీ జీవితంలో జరిగిన సంఘటనలు అన్నీ పూర్తిగా మార్చిపోవాలి. ఆ మర్చిపోయే సమర్ధత నీకు ఉండాలి. అప్పడు కదా నీ హృదయంలో ఉన్న తియ్యదనం నీకు అందేది. అహంభావనను అలంకరించటం మానివెయ్యి. ఈశ్వరుడిని అలంకరిస్తే ఆయన అనుగ్రహం నీకు వస్తుంది. ఆ అనుగ్రహ ప్రవాహంలో దేహధ్యాస పోతుంది. నీకు ఏ మార్గంలో ప్రయాణం చేయాలని అనిపిస్తే ఆ మార్గంలో ప్రయాణం చెయ్యి, ప్రయాణం మటుకు ప్రారంభించు. ఏ భావన అయితే దేహంతో తాదాప్యం చెందుతొందో ఆ భావనను తీసుకొనివెళ్ళి ఎక్కడ లయింపచేయాలో చూసుకో. అది మర్చిపోవద్దు. మీకు సరిఅయిన అవగాహన ఉంటే ఇప్పడే ఇక్కడే వస్తువు అనుభవంలోనికి వస్తుంది. మీకు సరిమైన అవగాహన లేకపోతే లోపల ఉన్న వస్తువు మాట అటు ఉంచండి మంచివారు కూడా చెడ్డవారిగా మీకు కనిపిస్తారు. అందువలన బహు జాగ్రత్త అవసరం.